సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



393 మార్కులతో నిరాశ

మార్కులు తక్కువగా వచ్చాయని ఓ టెన్త్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాకుళంలో ఘటన జరిగింది. - 4లో



అధికార మదంపై అక్షర శరం

సాక్షి కార్యాలయంపై దాడి జరగడాన్ని జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. జిల్లా కేంద్రంలో నిరసన తెలిపాయి. - 4లో

సర్పంచ్ సంవాద్‌లో సానివాడ సర్పంచ్‌కు చోటు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సానివాడ గ్రామానికి చెందిన సర్పంచ్ రుప్పలక్ష్మికి ఢిల్లీలో నిర్వహించిన సర్పంచ్ సంవాద్‌లో ఏపీ ప్రభుత్వం తరఫున జిల్లా నుంచి చోటు లభించినట్లు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్వచ్ఛ భారత్, జలజీవన్ మిషన్ సమావేశాల నిర్వహణలో ఆమె చేసిన కృషికి గాను స్టార్‌మహిళ అవార్డును ఢిల్లీలో అందుకున్నట్లు ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

ఇసుక లారీ బీభత్సం



జేఆర్ పురంలోని డివైడర్ మధ్యలో విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన లారీ

రణస్థలం: మండల కేంద్రంలోని సూర్య స్కూల్ జంక్షన్ వద్ద బుధవారం రాత్రి 8.50 గంటల సమయంలో ఇసుక లారీ బీభత్సం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న ఇసుక లారీ ముందు వ్యానును తప్పించబోయి డివైడర్ మధ్యలో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి నిలిచిపోయింది. అదే సమయంలో విశాఖపట్నం వైపు నుంచి రణస్థలం ఒక కారు వస్తుండగా ఆ కారుపై విద్యుత్ స్తంభం పడిపోయింది. కారు ముందు భాగంలో పడడంతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో కారులో కృష్ణాపురం మాజీ ఎంపీటీసీ ముల్లు కృష్ణ, పల్లుకొట్లు రామకృష్ణ, ధనరాజు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జేఆర్ పురం పంచాయతీకి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పోలీసు, విద్యుత్‌శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఉత్తీర్ణతలో.. పతనం ప్రథమ శ్రేణులు పదిలం



పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థానం అమాంతం పడిపోయింది. గత ఏడాది రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా ఈ ఏడాది మాత్రం 14వ స్థానానికి పడిపోయింది. అయితే ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతలో మాత్రం జిల్లాకు స్టేట్ ఫస్ట్ రావడం కాసింత ఊరట. గత ఏడాది 93.35 ఉత్తీర్ణత శాతంతో అదరగొట్టిన సిక్కోలు.. ఈ ఏడాది మాత్రం 82.41 శాతానికి పరిమితమైపోయింది.



శ్రీకాకుళం:

పదో తరగతి ఫలితాల్లో జిల్లా గత ఏడాదితో పోలిస్తే 12 స్థానాలు కిందకు పడిపోయింది. గత ఏడాది రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలవగా, ఈ ఏడాది 14వ స్థానానికి పడిపోయింది. జిల్లాలో 82.41 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 28,176 మంది పరీక్షలు రాయగా, 23,219 మంది పాసయ్యారు. బాలురుపై బాలికలదే పైచేయిగా నిలిచింది. 14,287 మంది బాలురు పరీక్షలు రాయగా 11,358 మంది ఉత్తీర్ణత సాధించారు 79.50 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే 13,889 మంది బాలికలు పరీక్షలు రాయగా, 11,861 మంది ఉత్తీర్ణులయ్యారు. 85.40 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతానికి సంబంధించి జిల్లా స్థానం పడిపోయినప్పటికీ ప్రథమశ్రేణిలో పాసయిన వారు జిల్లా నుంచే ఎక్కువ మంది ఉండటంతో రాష్ట్రంలోనే ప్రథమంగా నిలిచింది. ఉత్తీర్ణత సాధించిన వారిలో 19,114 మంది ప్రథమ శ్రేణిలోనూ, 2885 మంది ద్వితీయ శ్రేణిలోనూ, 1128 మంది తృతీయ శ్రేణిలోనూ ఉత్తీర్ణులయ్యారు. మందస మండలం హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె. జోషిత అనే విద్యార్థి 597 మార్కులతో జిల్లాలోనే ప్రథమంగా నిలిచింది.

యాజమాన్యాల వారీగా..

యాజమాన్యాలు వారీగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలలు 96.18 శాతంతో ప్రథమంగా నిలిచాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలల్లో ఫలితాలు వచ్చాయి. ప్రైవేటు పాఠశాలల్లో 95.77 శాతం ఉత్తీర్ణులయ్యారు. జ్యోతిబా పూలే పాఠశాలల్లో 94.33 శాతం, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 83.22 శాతం, కేజీబీవీల్లో 89.46 శాతం, మున్సిపల్ పాఠశాలల్లో 73.53 శాతం ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూళ్లలో 89.60 శాతం, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 90.48 శాతం, ట్రైబెల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 87.32 శాతం పాసయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 70.77 శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 76.22 శాతం ఉత్తీర్ణత పొందారు.

కుప్పిలిలో నలుగురు మాత్రమే..

ఫలితాలన్నింటినీ బేరీజు వేసుకుంటే జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్, కేజీబీవీల్లో ఉత్తీర్ణత బాగా తగ్గిందనే చెప్పాలి. అలాగే రాష్ట్రవ్యాప్తంగా కాపీయింగ్‌తో సంచలనమైన కుప్పిలి పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 53 మంది పరీక్షలు రాయ గా 49 మంది ఉత్తీర్ణులు కాలేకపోయారు.

గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పలు యాజమాన్యాల గురుకుల పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో చక్కటి ఉత్తీర్ణత సాధించారు.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఈ ఏడాది 525 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కాగా475 మంది పాసయ్యారు. ఫస్ట్‌క్లాస్ 398 మందికి వచ్చింది.
- మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల్లో 547 మంది పరీక్ష రాయగా 516 మంది పాసయ్యారు. 477 మందికి ఫస్ట్ క్లాస్ వచ్చింది.
- బీసీ వసతి గృహాల్లో ఈ ఏడాది 958 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 707 మంది పాసయ్యారు. ప్రథమ శ్రేణి 482 మందికి వచ్చింది. ఆరు వసతి గృహాల్లో వంద శాతం ఫలితాలు వచ్చాయి.

టాపర్లు వీరే..

టీచర్ల బిడ్డ



597 కంచరాన జోషిత

మందస: మందస మండలం హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కంచరాన జోషిత 597 మార్కులు తెచ్చుకుని అదరగొట్టింది. ఆమె తండ్రి మాధవరావు బి.కేశుపురంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తుండగా, తల్లి లేపాక్షి కూడా తాళభద్ర పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు.

సామాన్య కుటుంబంలో..



పొట్నూరు కుశాల్

నరసన్నపేట: గుండవల్లిపేట మహాత్మా జ్యోతిరావు పూలే స్కూల్ విద్యార్థి పొట్నూరు కుశాల్ 593 మార్కులతో సత్తా చాటాడు. రావులవలసకు చెందిన కుశాల్ తల్లిదండ్రులు పొట్నూరు హరి, లీలావతి. వీరు కిరాణాదుకాణం నడుపుతుంటారు.

రైతు కుమారుడు..



దోల మనోహర్

పాతపట్నం: మండలంలోని రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన దోల మనోహర్ 593 మార్కులతో ప్రతిభ చాటాడు. విద్యార్థి స్వగ్రామం ఆర్ఎల్ పురం. తండ్రి దోల తేజేశ్వరరావు వ్యవసాయం చేస్తుంటారు. తల్లి దోల సావిత్రమ్మ గృహిణి.

593

ఉపాధ్యాయుడి ఇంటిలో..



బి.ఉదయ్ కిరణ్

బూర్జ: ఓవీ పేట ఏపీ మోడల్ స్కూల్‌లో చదివిన బుడుమూరు ఉదయ్‌కిరణ్ 593 మార్కులు సాధించాడు. స్వగ్రామం కూడా ఓవీ పేట. విద్యార్థి తండ్రి బుడుమూరు వెంకటరమణమూర్తి మెళియాపుట్టి మండలం గోకర్నపురం ప్రాథమిక పాఠశాలలో టీచర్. తల్లి గోవిందమ్మ గృహిణి.

జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దుశ్చర్య పిరికిపందల చర్య అని కేంద్ర, రాష్ట్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ దాడిని నిరసిస్తూ బుధవారం రాత్రి శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ కూడలి నుంచి డే అండ్ నైట్ కూడలి వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచనలతో నిన్నటికే 35 విమానాలను ఏర్పాటు చేసి, 4,500 మంది పర్యాటకుల్ని వారి స్వస్థలాలకు చేర్చామన్నారు. దాడిలో శ్రీకాకుళం నగరానికి చెందిన చంద్రమౌళి చనిపోవడం బాధాకరమని, ఆయన మృతదేహం బుధవారం రాత్రి విశాఖపట్నం చేరుకోనుందని తెలిపారు. ర్యాలీలో ఎమ్మెల్యే గొండు శంకర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థలు, కూటమి నేతలు పాల్గొన్నారు. చంద్రమౌళి కుటుంబం 30 ఏళ్ల కిందట శ్రీకాకుళంలోని కృష్ణా పార్కు సమీపంలో నివాసం ఉండేది. - శ్రీకాకుళం



శ్రీకాకుళంలో కొవ్వొత్తుల ర్యాలీలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి

నూతన డీఐఈఓగా సురేష్‌కుమార్



డీఐఈఓగా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారిగా రేగ సురేష్ కుమార్ బుధవారం బాధ్య తలు చేపట్టారు. విజయనగరం జిల్లా గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సురేష్ కుమార్‌ను ఇటీవల రెగ్యులర్ డీఐఈఓగా శ్రీ కాకుళం జిల్లాకు పదోన్నతిపై నియమించారు. ఇప్పటివరకు డీవీఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన ఎస్.తవిటినాయుడుకి విజయనగరం జిల్లా రెగ్యులర్ డీఐఈఓగా పదోన్నతి లభించగా, సురేష్ కుమార్ శ్రీకాకుళం జిల్లాకు వచ్చారు. 1992లో సర్వీస్ కమిషన్ ద్వారా కామర్స్ జూనియర్ లెక్చరర్‌గా వృత్తిజీవితం ప్రారంభించిన సురే ష్‌కుమార్ చినమేరంగి, గుమ్మలక్ష్మీపురం, గజపతినగరంలలో పనిచేశారు. ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ఎస్.కోట, గుమ్మలక్ష్మీపురం, గుర్ల కళాశాల ల్లో పనిచేసి సౌమ్యునిగా పేరుపొంది, అత్యంత కీలకమైన బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా డీవీఈఓగా ఎఫ్ఏసీ బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. నూతన డీఐఈఓగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌కుమార్‌ను ఆర్ఐఓ దుర్గారావు, ప్రిన్సిపాల్స్ భీమేశ్వరరావు, వర్మ, నాగేంద్ర శర్మ, గణపతి వెంకటేశ్వరరావు, కీర్తి తవిటినాయుడు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రతినిధులు తదితరులు కలిశారు.

పర్యాటకులపై ఉగ్రదాడి దారుణం



శ్రీకాకుళంలో వైఎస్సార్ సీపీ నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పర్యాటక ప్రాంతమైన పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసి 26మందిని బలితీసుకోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బాధితుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముష్కరులు కశ్మీర్ పర్యాటక ప్రాంతంలోకి చొరబడి కాల్పులు జరపడం హేయమైన చర్య అని, దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. దాడికి నిరసనగా శ్రీకాకుళం నగరంలో వైఎస్సార్ కూడలి (ఏడురోడ్లు) వద్ద పార్టీ శ్రేణులంతా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా బలగాల్ని పెంచాలని, రక్షణవిభాగంలో నిఘా, భద్రత బలగాలపై కేంద్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కృష్ణదాస్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయా, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్, ఆమదాలవలస ఇన్‌చార్జి చింతాడ రవి, వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షులు దుంపల లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర జిల్లాల యువజన విభాగం అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గేదెల పురుషోత్తం, ముంజేటి కృష్ణ, ఎంఏ భేగ్, మార్పు పృథ్వీ, అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, బొడ్డేపల్లి రమేష్, టి.కామేశ్వరి, గొండు కృష్ణ, డాక్టర్ శ్రీనివాసపట్నాయక్, గద్దిబోయిన కృష్ణయాదవ్, పొన్నాడ రుషి, రౌతు శంకరరావు, సీహెచ్ భాస్కరరావు, శ్రీరామ్మూర్తి, చింతాడ రామ్మోహన్, బుక్కూరు ఉమామహేశ్వరరావు, పప్పల రమష్, సీపాన రామారావు, కె.తేజ, వానపల్లి రమేష్‌లతో పాటు అధిక సంఖ్యలో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తీవ్రవాదుల దాడి హేయం



కాశీబుగ్గ: జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో యాత్రికులపై జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా మనమందరం కలిసి కట్టుగా దేశ సమైక్యతను చాటాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీకూర్మనాథాలయ ఈఓగా కె.నరసింహనాయుడు

గార: శ్రీకూర్మనాథాలయ కార్యనిర్వహణాధికారిగా కె.నరసింహనాయుడును నియమించారు. ఆయన ఇప్పటివరకు ఆర్కియాలజీ, మ్యూజియం ఏడీగా అమరావతి సర్కిల్‌లో పని చేస్తూ దేవదాయ శాఖకు డిప్యుటేషన్ వచ్చారు. నెల రోజుల కిందటే డిప్యుటేషన్‌పై వచ్చినా ఇప్పటివరకు దేవదాయ శాఖ అనుమతి లేకపోవడంతో వెయిటింగ్‌లో ఉన్నారు. గురువారం నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు.

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



మందస: మందస మండలం కుడుమాసాయ్ గిరిజన గ్రామంలో ఓ మహిళ అంబులెన్స్‌లో ప్రసవించారు. ఆమెకు బుధవారం పురిటి నొప్పులు రావడంతో 108కు కాల్ చేశారు. అంబులెన్స్‌లో ఆమెను తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో నొప్పులు అధికం కావడంతో వాహనంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇద్దరినీ హరిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలెట్ రామచంద్రారెడ్డి ఉన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు



సభ ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎచ్చెర్ల మండలం బుడగుట్ల పాలెంలో ఈ నెల 26వ తేదీన పర్యటించనున్నారు. ఈ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం పర్యవేక్షించారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న సభ, హెలీప్యాడ్ ఏర్పాటు, వాహనాలు పార్కింగ్, మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహణపై చర్చించారు.

పుస్తక ప్రదర్శన



జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు మాట్లాడుతూ పుస్తకం మంచి నేస్తం వంటిదని అన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు పుస్తకాలు తెప్పించడం జరిగిందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాని సూచించారు. ఈ ప్రదర్శనలో రామాయణం, మహాభారతం, ఇతిహాసాలు, నాటికలు, ఇయర్ బుక్స్, నిఘంటువులు, పోటీ పరీక్షలకు సంబంధించిన 200 రకాల పుస్తకాలు ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి వీవీజీఎస్ శంకరరావు, పై.మురళీ కృష్ణ, యు.కల్యాణి, టి.రాంబాబు, పి.రామ్మోహన్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కందుకూరి పురస్కార గ్రహీతలకు సత్కారాలు



కందుకూరి పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని వాసవీ కల్యాణ మండపంలో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో ఇటీవల కందుకూరి పురస్కారాలు అందుకున్న కళాకారులను బుధవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. పురస్కారాలు అందుకున్న మెట్ట పోలినాయుడు, గుత్తు చిన్నారావులకు జ్ఞాపికలు, సన్మాన పత్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు, సుమిత్రా కళాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి బాట..



టెక్కలిలో వసతి గృహం నుంచి తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్తున్న తల్లిదండ్రులు

టెక్కలి: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు వేసవి సెలవులు ఇవ్వడంతో వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులంతా ఇంటి బాట పట్టారు. బుధవారం తరగతుల నిర్వహణ చివరి రోజు కావడంతో, సుదూర ప్రాంతాల్లో ఉన్న తల్లిదండ్రులంతా వసతి గృహాల వద్దకు చేరుకుని వారి పిల్లలకు సంబంధించి సామగ్రితో ఇంటి బాట పట్టారు. మళ్లీ జూన్ 12 న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

ఫిట్‌లెస్ సెంటర్



నాగావళి నదీ తీరాన గుజరాతీపేటలో ఫిట్‌నెస్ కేంద్రం

- శ్రీకాకుళం శివారులో వాహన ఫిట్‌నెస్ సెంటర్
- ఏజెంట్ కోడ్‌తో బుక్ చేసుకుంటేనే ఫిట్‌నెస్ మంజూరు
- ఆర్టీఏ అధికారుల అనుమతి లేకుండా ప్రైవేటు సంస్థ పేరుతో పత్రాల జారీ
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు



ఫిట్‌నెస్ కేంద్రానికి వాహనాలు వెళ్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్:

ఇటీవల ఓ ప్రైవేట్ బస్సు కొందరు పాసింజర్లతో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తుండగా మార్గమధ్యంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో తుప్పల్లోకి దూసుకుపోయింది. దీంతో ప్రయాణికులకు చిన్నచిన్న గాయాలయ్యాయి. అంతకు వారం రోజుల కిందటే బస్సుకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించినట్లు డ్రైవర్ తెలిపారు. ఆరా తీస్తే ఆ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చింది శ్రీకాకుళం శివారులోని ఓ ఫిట్‌నెస్ సెంటర్ అని తెలిసింది. ఎవరూ టెస్ట్ డ్రైవ్ చేయకుండా, మిషన్లతో పూర్తిస్థాయిలో పరీక్షించకుండా కేవలం మాన్యువల్‌గా పరీక్షించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇదే ప్రమాదానికి కారణం.

ఆర్టీఏ అధికారులెక్కడ..?

ఒకప్పుడు బస్సుకు గానీ, లారీలకు గానీ చివరికి ఆటోలకు సైతం ఫిట్‌నెస్‌లు చేయించాలంటే నేరుగా అనుభవం ఉన్న ఆర్టీఏ అధికారి ఆ వాహనాన్ని కొంతమేర డ్రైవింగ్ చేసేవారు. తర్వాతే సర్టిఫికెట్ ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం ప్రైవేట్ యాజమాన్య సంస్థలు లోపాలు గుర్తించడం లేదు. నామమాత్రంగా కొన్ని టెస్టులు చేసి అనుమతులు ఇచ్చేస్తున్నారు. నగరంలోని నాగావళి నదీ తీరాన, ఫాజుల్‌బేగ్ ప్రాంతం అగ్రికల్చర్ కార్యాలయం పరిధిలో వాహన ఫిట్‌నెస్ సెంటర్లకు కొన్ని నెలల కిందట అనుమతులు ఇచ్చారు. ఇక్కడ వివిధ రకాలైన ట్రాన్స్‌పోర్టు (ఎల్లోబోర్డు) వాహనాలన్నింటికీ మిషనరీతోనే బండి కండీషన్‌లకు పర్మిషన్లు ఇస్తున్నాయి. ఇక్కడ అనుభజ్ఞులైన ఆర్టీఏ అధికారులంటూ ఎవ్వరూ లేరు. ప్రైవేట్ యాజమాన్య సంస్థ పెట్టుకున్న సిబ్బందితోనే తూతూ మంత్రంగా వాహనాలకు ఫిట్‌నెస్‌లు జారీ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఫిట్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు చేసినప్పటికీ ఆటో నుంచి తోక లారీ వరకూ ఎలాంటి వాహనానికైనా ఫిట్‌నెస్‌కు సంబంధించిన అన్ని అనుమతులు ఆ ప్రైవేట్ యాజమాన్య సంస్థే ఫిట్‌నెస్‌లు ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఆర్టీఏ అధికారుల పాత్ర, అప్రూవల్ అంటూ ఏమీ లేకుండా పోయింది.

ఏజెంట్లకు పండగే

ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటు కావడంతో ఏజెంట్ల ఆశలు చిగురించాయి. వారు ఇచ్చిన టోకెన్ నంబర్ ఆధారంగానే ఏదైనా బండికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు త్వరితగతిన వచ్చేస్తున్నాయి. పొరపాటున నేరుగా ఆన్‌లైన్ ద్వారా ఎఫ్‌సీకు సంబంధించిన స్లాట్‌ను వాహన యజమాని బుక్ చేసుకుంటే అది పూర్తిగా ఫెయిల్ అవ్వాల్సిందే. ప్రభుత్వ ఆధీనంలో ఫిట్‌నెస్‌లు ఇచ్చేటప్పుడు మాత్రం ఈ పరిస్థితి ఉండేది కాదు. ఒకసారి స్లాట్ బుక్ చేసుకుంటే రెండోరోజుకు కూడా మార్చుకునే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం ఫిట్‌నెస్ సెంటర్‌లో ఆ పరిస్థితి లేకుండా పోయింది.

భారీ దోపిడీ

కేంద్రంలో వివిధ రకాలైన వాహనాలపై భారీ దోపిడీ జరుగుతోంది. ఇదంతా ఏజెంట్ల ద్వారానే కమిషన్ పద్ధతిలో నడుస్తోంది. స్థానికంగా ఏర్పాటు చేసిన రేట్లు కంటే అధిక రేట్లకు ముందస్తుగానే ఏజెంట్ ద్వారా డబ్బులు లాగేస్తున్నారు.

ఒక్క రోజులోనే నంబర్ ప్లేట్ల జారీ

వాస్తవంగా ఏదైనా బండి ఫిట్‌నెస్ కేంద్రానికి వెళ్తే హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్‌లు తప్పనిసరి. ఇది బండి కొన్ని నెలరోజులకే షోరూంకు వస్తుంది. కానీ ఫిట్‌నెస్ కేంద్రంలో ఒక్క రోజులోనే నంబర్ ప్లేట్‌ను ఏర్పాటు చేస్తూ అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వీటితో పాటు రూ. 20 విలువ చేసే రిఫ్లెక్టివ్ రెడ్ టేపును బండికి అంటించడానికి రూ. 300 నుంచి రూ.500 వరకూ దోచేస్తున్నారు.

ఫిర్యాదులు మా దృష్టికి వస్తున్నాయి



ఫిట్‌నెస్ కేంద్రంపై ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్నపుడు బండి కండీషన్ చూస్తూ ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు అందించేవాళ్లం. ప్రస్తుతం సెంట్రల్ గవర్నమెంట్ ఆధీనంలో ప్రైవేట్ పరం చేశారు. మా పాత్ర అంటూ ఏమీ లేదు. – విజయ సారథి, డీటీసీ

టోకెన్ తీసుకున్నాం



ఆటో ఫిట్‌నెస్ కోసం ఏజెంట్‌కు రూ.3000 డబ్బులు ఇచ్చి ఫిట్‌నెస్ టోకెన్ తీసుకున్నాం. ఉదయం 10 గంటలకు ఫిట్‌నెస్ కేంద్రంలో బండి పెట్టాను. మధ్యాహ్నం 3 గంటలకు బండి ఇచ్చారు. గతంలో ప్రభుత్వ ఆధీనంలో బండి ఫిట్‌నెస్ చేసుకుంటే రూ.1000తోనే సరిపోయేది. గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం ఉండేది కాదు. ఇక్కడ ప్రతి దానికి అధికంగా డబ్బులు కట్టాల్సిందే. – మురళి, ఆటో డ్రైవర్

'ఆపరేషన్ కగార్ ఆపాల్సిందే'



మేడే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రగతి శీల కార్మిక సమాఖ్య ప్రతినిధులు

పలాస: దండకారణ్యంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య డిమాండ్ చేసింది. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో బుధవారం మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. అన్ని ఊరువాడల్లో కార్మిక పతాకాలను ఆవిష్కరించి ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలన్నారు. కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పురుషులతో పాటు మహిళలకు సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతి శీల కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధనరావు, అధ్యక్షుడు మద్దిల ధర్మారావు, దాసరి నారాయణమూర్తి, మామిడి గణపతి, గూడ మన్మధ, డొక్కర లక్ష్మణ, తామాడ గంగయ్య, మురిపింటి గంగయ్య, దాసర దానేశు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నేలకు మేలు



మెట్టుపేటలో రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయం పంటను పరిశీలిస్తున్న దృశ్యం

పాతపట్నం: ప్రకృతి సాగుతో అటు నేలకు, ఇటు పంటకు ఎంతో మేలు జరుగుతుందని తద్వారా రైతుకు ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం ధనుంజయ అన్నారు. మండలంలోని మెట్టుపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి సహజ సిద్ధ ఆహారంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి నుంచి పండించే బెల్లం, వేరు శనగ, కొర్రెలు, కారం, రాగులు, చింతపండు వంటి పదార్థాలు తీసుకోవడం వద్ద కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ మంచి ఆరోగ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని రైతులకు, మహిళా సంఘాలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అండ్ న్యూట్రిషన్ రేణుక, గోవిందరెడ్డి, శివాజీ, సువర్ణరావు, శ్రావ్య, భారతి, రైతులు పాల్గొన్నారు.

పునరావృతం కాకుండా చూడాలి



శ్రీకూర్మనాథాలయంలో తాబేళ్ల పార్కు వద్ద బీజేపీ నాయకులు

గార: శ్రీకూర్మం క్షేత్రంలో తాబేళ్ల దహనం వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు. బుధవారం కూర్మనాథాలయానికి జనసేన నాయకులతో కలసి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాబేళ్ల మరణానికి గల కారణాలు విశ్లేషించాలని, దహనం చేయడంలో ఎవరు చేశారన్నది త్వరగా విచారించాలని కోరారు. కార్యక్రమంలో పైడి వేణుగోపాలరావు, శివ్వాన ఉమామహేశ్వరి, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పండి యోగీశ్వరరావు, పైడి సిందూర, జనసేన నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు అడుగుల పుస్తకం ఆవిష్కరణ



ఆడవరం పాఠశాలలో ఆరు అడుగుల పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

గార:

తెలుగు భాషా విజ్ఞానానికి సంబంధించి ఆరు అడుగుల పెద్ద పుస్తకాన్ని బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవిష్కరించారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా అంపోలు పంచాయతీ ఆడవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం భోగెల ఉమామహేశ్వరరావు ఈ పుస్తకాన్ని తయారు చేశారు. వీటిలో అక్షర వర్ణమాల, గుణింత పేర్లు, పదాలు, పద్యాలు, గురజాడ, గిడుగు, వేమన వంటి సాహిత్య కవుల చరిత్రలు, పాఠశాల ప్రగతికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరిచారు. పుస్తక జ్ఞానంలో మనిషి విద్యావంతుడు అవుతాడన్నారు.

393 మార్కులతో నిరాశ

- ఆత్మహత్యకు పాల్పడిన టెన్త్ విద్యార్థి
- శ్రీకాకుళం బలగ హడ్కో కాలనీలో విషాద ఘటన



మార్చురీలో వేణుగోపాల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్



గూరుగుబిల్లి వేణుగోపాల్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : అరవై శాతానికి పైగా వచ్చిన మార్కులు ఆ విద్యార్థికి అవమానంగా తోచాయి. తోటి పిల్లలతో పోల్చి చూసుకునే తత్వం ప్రాణాల మీదకు తెచ్చింది. గౌరవప్రదమైన మార్కులే అయినా 'పోటీ' ప్రపంచానికి వాటిని చెప్పలేక ఓ బాలుడు ఊపిరి వదిలేశాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ బిడ్డ బలవన్మరణానికి పాల్పడడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. బుధవారం ఉదయం జిల్లాకేంద్రంలోని బలగ హడ్కో కాలనీకి చెందిన పదోతరగతి విద్యార్థి గూరుగుబిల్లి వేణుగోపాలరావు(15) ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే..

జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని ఎయిడ్స్ కంట్రోల్‌బోర్డు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న గూరుగుబిల్లి అమ్మినాయుడు తన భార్య, కుమార్తె, కుమారునితో కలసి బలగ హడ్కో కాలనీలో నివాసముంటున్నారు. కుమార్తె బీటెక్ ఇంజినీరింగ్ చదువుతుండగా కుమారుడైన వేణుగోపాలరావు స్థానిక ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు.

393 మార్కులే రావడంతో..

బుధవారం ఉదయం 11 గంటలకు పదో తరగతి ఫలితాలు విడుదల కావడంతో వేణుగోపాల్ ఇంటి వద్దనే తల్లి మొబైల్‌లో ఫలితం చూసుకున్నాడు. అప్పటి నుంచి మౌనంగానే వేరే గదిలోకి వెళ్లి తలుపు మూసుకున్నాడు. అప్పటికే తనయుని ప్రవర్తనపై తల్లికి అనుమానం వచ్చింది. తలుపు కొట్టినా ఎంతకీ తీయకపోవడంతో ఆందోళన చెందిన తల్లి బయటకు వెళ్లి వేరేవారి మొబైల్ తీసుకుని భర్తకు కాల్ చేసింది. విధుల్లో ఉన్న వేణుగోపాల్ తండ్రి హుటాహుటిన ఇంటి కొచ్చి తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. ఫ్యానుకు చీరతో ఉరేసుకున్న కుమారున్ని చూసి హతాశులయ్యారు. కొన ఊపిరైనా ఉంటుందేమోనని అంబులెన్సును పిలిపించి రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌కు చేరేసరికే చనిపోయాడని వైద్యులు ధ్రువీకరించడంతో భోరున విలపించారు. అనంతరం వేణు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆదిత్యుడి కర్ఫ్యూ



సూర్యుడు అప్రకటిత కర్ఫ్యూ విధించాడు. రెండు రోజులుగా నిప్పుల వాన కురిపిస్తూ బయటకు రావడానికి కూడా భయపడేలా రెచ్చిపోతున్నాడు. మధ్యాహ్నం వేళ తీక్షణమైన కిరణాలతో దాడి చేస్తున్నాడు. సూరీడి ధాటికి రోడ్లన్నీ ఇలా నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. శ్రీకాకుళంలోని సూర్య మహల్ కూడలి గత రెండు రోజులుగా ఇలా ఖాళీగానే దర్శనమిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

అధికార మదంపై.. అక్షర శరం

- 'సాక్షి' కార్యాలయంపై దాడి హేయం
- ఖండించిన జర్నలిస్టులు, ప్రజా సంఘాలు
- శ్రీకాకుళంలో నిరసన ప్రదర్శన



ఎస్పీకి రాసిన వినతిపత్రాన్ని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావుకు అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం, శ్రీకాకుళం క్రైమ్ :

ఏలూరులోని 'సాక్షి' జిల్లా కార్యాలయంపై టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరుల దాడిని అక్షరంపై అధికార పార్టీ దురహంకారంగా జర్నలిస్టు సంఘాలు అభివర్ణించాయి. మొన్నటికి మొన్న 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి మరో ఆరుగురు జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించిన సంగతి మర్చిపోక మునుపే.. ఇప్పుడు ఏకంగా టీడీపీ శాసనసభ్యుడే వేరే నియోజకవర్గంలో ఉన్న సాక్షి కార్యాలయానికి వందల మంది అనుచరులతో వెళ్లి ధ్వంసరచనకు పూనుకోవడం పత్రికారంగ చరిత్రలోనే చీకటి రోజుగా మిగిలిపోతుందని అంతా మండిపడ్డారు. గతంలో కూడా దళిత తహసీల్దారుపై దాడి చేయించిన చింతమనేనిలాంటి వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు వెనకేసుకురావడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

తక్షణమే చింతమనేనిని బర్తరఫ్ చేయాలని, శాసనసభ సభ్యత్వాన్ని తొలగించి ఆయనపై, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు బుధవారం ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డేఅండ్ నైట్ కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ప్లకార్డులు చేతబూని ర్యాలీ చేశారు. అంబేడ్కర్ కూడలి వరకు వెళ్లి మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం ఎస్పీకి వినతిపత్రం అందించేందుకు వెళ్లగా.. ఆయన లేకపోవడంతో సీఐ ఈశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కొంక్యాణ వేణుగోపాల్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు జోగినాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు, జిల్లా దళిత జేఏసీ కన్వీనర్ డాక్టర్ కంఠ వేణు, జిల్లా గ్రంథాలయ శాఖా కన్వీనరు బుడుమూరు సూర్యారావు, ఏపీయుడబ్ల్యూజే సీనియర్ సభ్యులు జి.వి.నాగభూషణం, దళిత నాయకుడు తైక్వాండో శ్రీను, సాక్షి బ్యూరో చీఫ్ కందుల శివశంకర్, సాక్షి టీవీ బ్యూరో సునీల్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు బీవీఎస్ నాయుడు, శ్రీనివాసరావు, బాలు, వాసు, బి.రమేష్, చిన్నారావు, ఈశ్వరరావు, ప్రసాద్, సన్యాసినాయుడు, సీనియర్ జర్నలిస్టులు వీవీఎస్ఎన్ శ్రీనివాస్, బగాది అప్పలనాయుడు, బలివాడ శివప్రసాద్, మల్లేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆగడాలను అరికట్టాలి..



సాక్షి కార్యాలయంపై దెందులూరు టీడీపీ కూటమి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులతో దాడి చేయించడం అత్యంత హేయం. ఎమ్మెల్యే ఆగడాలను ఇప్పటికైనా ప్రభుత్వం అరికట్టి కేసులు పెట్టి అరెస్టు చేయాలి. మీడియా హక్కును కాపాడాలి. తప్పుడు సమాచారంతో వార్తలు రాస్తే లీగల్‌గా నోటీసులు పంపాలి తప్ప ఇలా కార్యాలయాలపై దాడులు చేయించడం ప్రభుత్వం తరఫున బాధ్యత గల ఓ శాసనసభ్యునిగా ఉన్న చింతమనేని దేనికి సంకేతమిస్తున్నట్లు.

– జోగినాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు

మీడియాను భయభ్రాంతులకు గురిచేస్తూ..



పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా రంగాలను భయభ్రాంతులకు గురిచేయడాన్నే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడి చేయించారంటే వారి తప్పు ఎత్తిచూపుతున్న సాక్షి జర్నలిస్టులపై అక్కసు కక్కినట్లే. పత్రికారంగం లేనిదే ఏ నాయకుడు అధికారంలోకి రాలేడన్నది గుర్తు పెట్టుకోవాలి.

– బుడుమూరు సూర్యారావు, జిల్లా గ్రంథాలయ శాఖ కన్వీనరు

వ్యక్తిగత కక్షలతోనే దాడులు..



తమ అక్రమాలను, తప్పులను రాస్తున్న పత్రికా ప్రతినిధులపై దాడి చేసే వరకు వెళ్తున్నారంటే వ్యక్తిగతంగా వారిపై కక్ష కడుతున్నారు. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తున్నారు. ఇలా చేసే ప్రభుత్వాలన్నీ తుప్పు పట్టిపోయాయి.

– జి.వి.నాగభూషణం, ఏపీయూడబ్ల్యూజే సీనియర్ సభ్యులు

అరాచకాలకు ప్రభుత్వ మద్దతు



తమ ఎమ్మెల్యేలు చేస్తున్న అరాచకాలకు కూటమి ప్రభుత్వం మద్దతు పలుకుతోంది. ఏలూరులో సాక్షి కార్యాలయాన్ని ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను ఖూనీ చేసినట్లే. దాడికి పాల్పడ్డ ఇదే చింతమనేని గతంలో దళిత మహిళా తహసీల్దార్‌పై కూడా విచక్షణారహితంగా ప్రవర్తించారు. చింతమనేనిపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– కొంక్యాణ వేణుగోపాల్, ఏపీడబ్ల్యూఏఎఫ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి

అధికార దురహంకారమిది..



ఏలూరు సాక్షి కార్యాలయంపై వందల మంది అనుచరులతో వెళ్లి ఎమ్మెల్యే చింతమనేని దాడి చేయించడం అధికార, మతోన్మాద, దురహంకారం. ఆయన తీరుతో చీకటి రోజులు గుర్తుకువస్తున్నాయి. దళిత మహిళా తహసీల్దార్‌పై గతంలో ఇలానే దాడి చేశారు. ఇప్పుడు పత్రికా కార్యాలయాలు, ప్రతినిధులపై దాడులు చేయిస్తే ఖబడ్దార్. చింతమనేనిని బర్తరఫ్ చేయాలి. శాసనసభ సభ్యత్వాన్ని తొలగించాలి.

– కంఠా వేణు, శ్రీకాకుళం జిల్లా దళిత జేఏసీ కన్వీనరు

ముక్తకంఠంతో ఖండించాలి



మీడియాపై దాడులు ప్రజాస్వామ్యవాదులంతా ముక్తకంఠంతో ఖండించాలి. ఏలూరులో సాక్షి కార్యాలయంపై దాడిని తీవ్రంగా మా ప్రజాసంఘాలు ఖండిస్తున్నాయి. పత్రికా స్వేచ్ఛపై దాడి చేయించడంలో కూటమి ప్రభుత్వం రెచ్చగొట్టే ధోరణి కనపడుతోంది. మొన్నటికి మొన్న సాక్షి ఎడిటర్, ఆరుగురి జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టించడం, మళ్లీ ఇప్పుడు ఇలా.. ఏమనుకోవాలి వీరి చర్యలను.

– తేజేశ్వరరావు, సీఐటీయు జిల్లా కార్యదర్శి